**మా**ది తల్లాడ మండల కేంద్రం. జాతీయ రహదారి నుండి ఊర్లకొచ్చే దారిన రోడ్డు వారన మా హరిజనవాడ వుంటది. నాగు బామోలె సాగిపొయ్యే రోడ్డు మాల, మాదిగల్ను ఏరుజేస్తది. రోడ్డుకు ఉత్తరాన మాదిగ గూడెం, దచ్చినాన మాల గూడెం వుంటయి. ఆ రోడ్డెంట ఇంకొంత దూరంల ఊరు వుంటది. అండ్ల మిగిల్న అన్ని కులాలోళ్ళూ వుంటరు.

మాల మాదిగల్ను అంటరానోళ్ళంటరు. 'హరిజనులు' అని గాంధీ మహాత్ముడు చెప్పిన్రు. 'అంటరానితనం నేరం' అని రాజ్యాంగంల రాసిన్రు. నేను సాంగీకశాస్త్రంల సదివిన.

నాపేరు ఇసంపల్లి నీలమ్మ. మా హరిజనవాడలున్న ప్రాదమికోన్నత పాటశాలల ఏడో తరగతి సదువుతున్న. నా తమ్ముని పేరు అంజయ్య. ఆయినె అయిదో తరగతి సదువుతుండు. మేం మాదిగ కులస్తులం. మా బళ్ళె సదువుకునె పిల్లలల్ల మాదిగలు, మాలలే ఎక్కువ



మంది వుంటరు. శాన కొద్ది మంది ఎరుకల ఒడ్డెర కులాల పిల్లలు వున్నరు.

మాకు బూమి లేదు. ఒక గుడిశెల వుంటం. అండ్లనే సర్కారు కట్టిచ్చిన ఒక డాబ గది వున్నది. అండ్ల నేనూ, నా తమ్ముడూ రేత్రి పూట సదువుకుంటం. మా తాతముత్తాతల నాట్నుండి శెప్పులు కుట్టుడు కుల వృత్తి. మా నాయిన శెప్పులు కుట్టడు - ఎవరు గొనరని. ఎందుకొరకంటె పెద్ద పెద్ద కంపినోల్లు ఇప్పుడు శెప్పులు తయారుజేస్తున్రు. అందుకని మా అమ్మ నాయిన కూలి పనులకు బోతరు. ఊర్ల ఎగసాయం పనులు దొరకని రోజులల్ల మా పక్కనున్న కమ్మం పట్టణం బోతరు. శెలవులల్ల నేనూ నా తమ్ముడూ శెలకలల్ల పనులకు బోతం - సర్కారు బల్లె సదువుతున్నం గద మద్దేన్నం బువ్వ బెడ్తరు.

ఆ ఏళ సద్దుల పండుగ. మా నాయిన కోడి కుయ్యక ముందుగాల్నె నిద్ర లేశిండు. రొండు పెద్ద పెద్ద గోనె బస్తలు తీసుకుండు. 'యాడి కయ్యా ఇంత పొద్దుగాల్నే' అంది మాయమ్మ. 'మనూరి శెరువు నిండ కల్వబూలు పూసినై గద. కోసొస్తి కమ్మంల అమ్ముకుంటె పైసలొత్తయ్ - ఇయ్యాల అద్ద బందు గద' అన్నడు. పాత సైకిలు బైటకు తీసిండు. సట్లె వున్న చద్ది అన్నం దీసి పైన ఎల్లిపాయ కారమేసి చేతికిచ్చింది మా అమ్మ.

బతుకమ్మల పోగే ఏళ. మా ఊళ్ళె గూడ పండుగ జేస్తున్రు. మాల మాదిగలు అన్నింటికీ అంటరానోళ్లే గద! నేను బతుకమ్మ పెట్టుకోలేక పోయినా ఏడుక మాత్రం జూస్తున్న. ఇంతట్లనె కారుమబ్బులు కమ్ముకొచ్చినై. తళతళ మెరుపులు. పెళ పెళ ఉరుములు. శిటపట శినుకులతో మొదలైన వాన కుండపోతైంది.

నాయిన ఇల్లు ఇంక చేరనే లేదని మా నాయినమ్మా అమ్మా తెగ రంది పడిపోతున్రు. రంగు రిబ్బెన్లూ గాలి బూరలూ రంగురంగుల బూరలూ నాకోసం తెస్తనన్నడు నాయిన. ఎప్పుడొస్తడా అనుకుంట రోడ్డు మీన్నే కాపుగాసిన. నా పక్కనే తమ్ముడు. లబ్బరి బంతి దెస్తనన్నడట వానికి.

బర్రునొచ్చి మా ఇంటి ముంగట ఆటో ఆగింది. మా నాయినమ్మా అమ్మా లోన నుంచి ఉరికొచ్చిన్రు. నేనూ తమ్ముడూ దబ దబ ఉరికినం - సుట్టాలెవురన్న ఒచ్చిన్రా ఏంది అనుకుంట!

ఆ ఆటో నడిపిటాయినె మాల ఎంకన్న. 'చిన్నాయినా' అంటం మేం. ఆయినే ఉరుక్కుంట దొడ్లెకి బొయ్యి రొండు మోపుల ఒరిగడ్డి దెచ్చి నేల మీన పరిశిండు. ఇంకో ఇద్దరి సాయంతో నాయిన్ని దించి దాని మీన పండుకోబెట్టిన్రు. మీన కలువ పువ్వులు కప్పిన్రు. మా అమ్మా నాయినమ్మా గుండెలు బాదుకుంట ఏడుస్తున్రు.

'ఏంది' అనడిగినం ఎంకన్న శిన్నాయిన్ని. శెరువుల కలువలు కొయ్య బొయ్యి ఊబిల కూరుకోని మీ అయ్య సచ్చిపోయిండు అన్నడు. శాన కష్టం మీన శవాన్ని బైటికి గుంజిన్రంట.

ఇరిసిన కలువ పువ్వోలె నవ్వుతున్నట్టె వున్నడు నాయిన. వాన శినుకులకు మొహం మరింత అందంగ అవుపడుతాంది.

నువ్వు పంతులమ్మవు కావాల్నే బిడ్డ - అంటున్నట్టె వున్నడు. మంచిగ సదువుకొని పెద్ద ఉజ్జోగం జెయ్యాల్రా కొడుకా అని మా తమ్మునితో అంటున్నట్టె వున్నడు.

నా ఓలె కూలి బతుకులొద్దు బిడ్డలాలా అంటున్నట్టె వున్నడు. అంటరానోల్లమనే బిరుదు లేకుంట బతుకాలెరా అంటున్నట్టె వున్నడు.

ఏడ్పురాలే నాకు - అప్పటికీ ఇప్పటికీ.

కండ్లు మూసినా తెరిసినా మా నాయినే నా కండ్లల్ల మెదుల్తుండు. ●

జీవన్ •